క్లుప్తంగా

ఆటోల రూటే సెపరేటు



ఆటో స్టాండ్ కాదు.. ఉప్పాడ బస్టాండ్ వద్ద మెయిన్ రోడ్డు

పిఠాపురం: ట్రాఫిక్ రూల్స్ పాటించండి, ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకండి.. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించండం టూ పిఠాపురంలో పోలీసులు చేపట్టిన ఊక దంపుడు అవగాహన సదస్సులు అభాసుపాలవుతున్నాయి. పిఠాపురంలో ఆటోల పార్కింగ్ మరీ దారుణంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. నడి రోడ్డే తమ అడ్డాగా ఆటోలను అడ్డంగా పెట్టి మరీ ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నా, పట్టించుకునే వారే కనిపించడం లేదంటున్నారు. కేవలం అవగాహన సదస్సుల పేరుతో ఫొటోలకు ఫోజులివ్వడం మినహా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన పాపాన పోవడం లేదని పోలీసుల తీరును దుయ్యబడుతున్నారు. అత్యంత రద్దీగా ఉండే పిఠాపురం ముఖ్య కూడలైన ఉప్పాడ బస్టాండ్ వద్ద పరిస్థితి మరీ దారుణం. నడి రోడ్డునే ఆటో స్టాండ్‌చేసి ఇష్టారాజ్యంగా ఆటోలను పార్కింగ్ చేయడం, పోలీసులు కనీసం పట్టించుకోకపోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు.

వైభవంగా కుంతీమాధవ స్వామి గ్రామోత్సవాలు



గరుడ వాహనంపై స్వామివారు

పిఠాపురం: పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన కుంతీమాధవస్వామి వార్షిక కల్యాణోత్సవాలు పిఠాపురంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం శేష, గరుడ వాహనాలపై గ్రామోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం నిర్వహించనున్న స్వామివారి రథోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఎన్.శ్రీరాములు తెలిపారు.

డివైడర్ ఎక్కిన ఆర్టీసీ బస్సు



డివైడర్‌పై నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సు

పెద్దాపురం: అతి వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం, కాకినాడ నుంచి రాజమహేంద్రవరానికి వెళుతున్న ఆర్టీసీ బస్సు స్థానిక దర్గా సెంటర్ వద్ద అదుపుతప్పింది. వేగంగా రోడ్డు డివైడర్ పైకి ఎక్కి ఆగింది. ఆ సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నారు. అంతా సురక్షితంగా ఉన్నారు. దీనిపై పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తులకు అల్పాహారం ఏర్పాటు



సూరంపాలెంలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

సామర్లకోట: వేట్లపాలెం గ్రామానికి చెందిన గుమెళ్ల రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు భద్రాచల యాత్రికులకు సూరంపాలెంలోని పామాయిల్ తోటలో ఆదివారం అల్పాహారం ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం గొంచాల నుంచి లోక కల్యాణార్థం భద్రాచలానికి పాదయాత్ర చేపట్టిన విషయం విదితమే. సుమారు 200 మంది భక్తుల పాదయాత్ర రెండో రోజు సూరంపాలేనికి చేరింది.

నిత్యాన్నదానానికి పెరిగిన రద్దీ



మరిడమ్మ ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పెద్దాపురం: ప్రసిద్ధి చెందిన మరిడమ్మ ఆలయంలో నిత్యాన్నదానానికి భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి దాతలు సహకరించాలని కోరారు.



నీరు తొలగిస్తున్న పుష్కరిణి



ఆలయ మొదటి అంతస్తులో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్న కూలీలు



ఆలయంలో చలువ పందిళ్లకు చేస్తున్న ఏర్పాట్లు


మహా శివరాత్రికి జోరుగా ఏర్పాట్లు

- పంచారామ క్షేత్రంలో చురుగ్గా క్యూలైన్లు, చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ పనులు
- 24 నుంచి మార్చి ఒకటి వరకు ఉత్సవాలు
- స్వామివారి కల్యాణంతో ప్రారంభం

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి కోరిన కోర్కెలు తీర్చుతాడని భక్తుల నమ్మకం. అతి ప్రాచీన పంచారామ క్షేత్రాల్లో ప్రముఖమైనది. కాకినాడకు 14 కి.మీ., రాజమహేంద్రవరానికి 52 కి.మీ. దూరంలో గోదావరి కాలువ ఆవలి వైపున ఉంది. ఈ క్షేత్రం పూర్వం చాళుక్య భీమవరంగా ప్రసిద్ధి చెందినట్టు ఇక్కడ శిలా శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ క్షేత్రంలోని పరమేశ్వరుడు యోగ లింగంగా సాక్షాత్కరిస్తారు. దీనిని స్వయంగా కుమారస్వామి ప్రతిష్ఠించడం వల్ల కుమారారామ భీమేశ్వరస్వామిగా పిలుస్తారు. పిఠాపురంలో లభించిన శాసనం ప్రకారం 9వ శతాబ్ది చివరిలో వేంగి చాళుక్య పాలకుడైన మొదటి చాళుక్య భీముడు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు తెలుస్తోంది. ఈ నెల 24 నుంచి మార్చి ఒకటి వరకు ఆలయం వద్ద మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 24న రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుంది. 26న మహా శివరాత్రి ఉత్సవం, 27న రథోత్సవం జరుగుతాయి. మార్చి ఒకటిన రాత్రి పుష్పయోగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

స్వామి కల్యాణంతో..

మహా శివరాత్రికి 20 రోజుల ముందు నుంచే ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారుల అంచనా. ఈ మేరకు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉచిత దర్శనంతో పాటు, రూ.20, రూ.50, రూ.100 దర్శనాలకు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రధాన ద్వారం నుంచి ఆలయంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయమంతా విద్యుద్దీపాలంకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. మహా శివరాత్రి పర్వదినాన ఆలయ కోనేరులో వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉన్నందున, కోనేరులో నీటిని మార్చేందుకు చర్యలు చేపట్టారు. గోదావరి జలాలు, బోరు నీటితో పుష్కరణిని నింపుతారు.



సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం

మెరుగైన ఏర్పాట్లు



గోదావరి కాలువ దాటి వచ్చే భక్తుల కోసం మాండవ్య నారాయణస్వామి ఆలయం వద్ద కాలిబాట వంతెన, ఆలయ ముఖ ద్వారం వద్ద ఇనుప వంతెన, రైల్వే గేటు ఎదురుగా వంతెన నుంచి ఆలయం వరకు విద్యుద్దీపాలు ఏర్పాటు చేశాం. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నాం. స్వామివారి కల్యాణం ప్రతి ఒక్కరూ తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. కల్యాణ విశిష్టతను వివరించేలా ప్రముఖ పండితులను నియమిస్తున్నాం. పుష్కరణిలో నీటిని తొలగిస్తున్నాం. మహా శివరాత్రి రోజున పుష్కరిణి వద్ద గజ ఈతగాళ్లను నియమిస్తాం. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేస్తున్నాం. తాగునీరు, మజ్జిగ, పాలు, అల్పాహారం, భోజనాల పంపిణీ సదుపాయాలు కల్పిస్తున్నాం.

– బళ్ల నీలకంఠం, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట

ఉపవాసంతో సత్ఫలితాలు



శివరాత్రి పర్వదినం రోజున ఉపవాస దీక్షతో ప్రదర్శన, జాగరణ చేయడం ద్వారా ముక్తి, మోక్షం లభిస్తుంది. త్రయోదశితో కూడిన మహా శివరాత్రి రావడంతో విశిష్టత ఉంది. మాఘ కృష్ణ చతుర్దశిని (బహుళ చతుర్దశి) మహా శివరాత్రిగా చెబుతారు. 24 గంటల పాటు ఉండే శివరాత్రి రోజున శివ నామస్మరణ చేయడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయి. పంచారామ క్షేత్రంలోని యోగలింగాన్ని పూజించడం ద్వారా భోగ, మోక్షం కలుగుతాయి.

– వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీచక్ర పండితుడు, సామర్లకోట

పాదగయ పుష్కరిణిలో నీటి తొలగింపు

పిఠాపురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పిఠాపురం పాదగయ క్షేత్రంలో త్వరలో ప్రారంభం కానున్న మహా శివరాత్రి ఉత్సవాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ కాట్న జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు. శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా రెండు రోజులుగా పాదగయ పుష్కరిణిలో నీటిని తొలగించారు. పుష్కరిణి చుట్టూ ఉన్న ఇనుప గ్రిల్స్‌ను శుభ్రం చేయడంతో పాటు, రంగులు వేస్తున్నారు. పుష్కరిణి చుట్టూ మెట్లు శుభ్రం చేయించడంతో పాటు, మరమ్మతులు చేయిస్తున్నారు. మహా శివరాత్రి ఉత్సవాలకు పుష్కరిణిని సిద్ధం చేసి, కొత్త నీరు నింపే చర్యలు చేపట్టారు. మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులతో ఈఓ సమీక్షించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వైద్యం, మరుగుదొడ్లు తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరిణిని పూర్తిగా శుభ్రం చేసి, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినపుడు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేసి, అక్కడ కూడా మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మహిళలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయడంపై దృష్టి సారించామన్నారు. ఉత్సవాల ప్రారంభం నుంచి ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుని, ఉత్సవాలు వైభవంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. గతంలో కంటే భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో, ఆ స్థాయిలో ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం ఆలయానికి రంగులు, చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ పనులు ప్రారంభించామని తెలిపారు.



పాదగయ క్షేత్రం పుష్కరిణిలో నీటిని తొలగించాక..



పాదగయ క్షేత్రంలో రంగులు వేస్తున్న సిబ్బంది

బార్.. బ్రాందీ షాపు దాటి..

- రేషన్ సరకుల కోసం మహిళల అవస్థలు
- 11వ సచివాలయ వార్డులకు రాని ఎండీయూ వాహనం

సామర్లకోట: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి గుమ్మం వద్దే రేషన్ సరకులు చేరుతుండేవి. గంటల తరబడి సరకుల కోసం రేషన్ షాపుల ముందు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నుంచి విముక్తి కలిగినందుకు మహిళలు ఎంతో సంతోషించారు. తాజా కూటమి ప్రభుత్వ హయాంలో మహిళలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. నెలల తరబడి రేషన్ వాహనం రాకపోవడంతో.. కిక్కిరిసిన బార్లు, మద్యం దుకాణాలు దాటుకుంటూ వెళ్లి రేషన్ సరకుల కోసం మహిళలు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి దాపురించింది.

పట్టణంలోని 11 సచివాలయ పరిధిలో ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారుల కష్టాలు పరిష్కారం కావడం లేదు. ఈ సచివాలయం పరిధిలోని 13, 22, 23, 24 వార్డులకు చెందిన లబ్ధిదారుల వద్దకు నాలుగు నెలలుగా ఎండీయూ వాహనం రాకపోవడంతో, రేషన్ షాపుల వద్ద సరకులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. ఈ నెల నుంచి ఎండీయూ వాహన సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి చెప్పినా, సమస్య ఇంతవరకు పరిష్కారం కాకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 23వ వార్డులోని సత్యనారాయణపురం ప్రజల కష్టాలు మరీ ఎక్కువగా ఉన్నాయి. జయలక్ష్మి థియేటర్ సమీపంలోని రేషన్ షాపు నుంచి 23వ వార్డుకు చెందిన లబ్ధిదారులు రేషన్ సరకులు తీసుకోవాల్సి వస్తోంది. సత్యనారాయణపురం, అప్పయ్యచెరువు, మాజేటినగర్ ప్రాంతాలకు చెందిన మహిళలు.. ఓవైపు బార్, మరోవైపు రోడ్డులో బ్రాందీ షాపు ఉండటంతో.. అటుగా వెళ్లే మహిళలు మందుబాబులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా, తమ సమస్యను పరిష్కరించడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రేషన్ షాపులకు వేలిముద్రలు వేసే యంత్రం ఒకటే ఉండటంతో, అందరికీ సరకులు అందడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి. 23వ వార్డులోని వారికి కేవలం ఆది, సోమవారాల్లో మాత్రమే రేషన్ షాపులలో సరకులు ఇస్తారనే ప్రచారం జరగడంతో, లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. రేషన్ షాపులలో కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కంది పప్పు సరఫరా హామీకే పరిమితమైందని మండిపడుతున్నారు. 11వ సచివాలయానికి వచ్చే ఎండీయూ వాహన నిర్వాహకుడిపై ఆరోపణలుండటంతో, దానిని నిలిపివేసినట్టు తెలిసింది. వచ్చే నెల నుంచైనా వాహనం ద్వారా సరకులు అందుతాయా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డిని వివరణ కోరగా, మహిళల ఇబ్బందులను డీఎస్ఓకు వివరించి, ఎండీయూ వాహన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



23వ వార్డులోని రేషన్ షాపు వద్ద లబ్ధిదారులు



పొగమంచు కమ్మేసిన ప్రత్తిపాడు-సామర్లకోట ప్రధాన రహదారి

పెద్దాపురం: వేకువజాము నుంచి కురిసిన పొగ మంచుతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు పట్టణ, మండలంలోని అన్ని గ్రామాల్లో పొగ్గముంచుకొనే ఉంది. చలి పెద్దగా లేనప్పటికీ గ్రామాలన్నీ పొగమంచు కప్పి ఉండడంతో ఉదయాన్నే పొలాలకు వెళ్లేవారు, వాహనదారులు అలాగే ప్రయాణం సాగించారు. ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక.. ప్రధాన రహదారుల్లో నెమ్మదిగానే వాహనాలను జాగ్రత్తగా ముందుకు నడిపించారు. శీతాకాలంలో ఎన్నడూ లేని విధంగా రెండు రోజులుగా పొగ మంచు కురవడం ఇదే ప్రథమం.



పొగ మంచులో పొలాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిఠాపురం: రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు, గొల్లప్రోలు పాపయ్య చావిడికి చెందిన గంపల జెంబు వంట పని చేస్తుంటాడు. ఈ నెల 3న చేబ్రోలుకు వంట పనికి వెళ్లి, రాత్రి ఒంటి గంట సమయంలో స్కూటర్‌పై తిరిగొస్తుండగా గొల్లప్రోలు డంపింగ్ యార్డ్ సమీపంలో బ్రిడ్జి వద్ద అదుపుతప్పి వాహనంతో రోడ్డుపై పడిపోయాడు. అతడి తలకు, ఇతర చోట్ల గాయాలు కావడంతో, చికిత్స కోసం కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి మేనమామ గంపల వీరనాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బషీర్‌బీబీ ఔలియా గంధోత్సవం

- బంగారు పాపమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

కొత్తపల్లి: మత సామరస్యానికి అద్దం పట్టే పొన్నాడలోని బంగారు పాపమ్మ(బషీర్‌బీబీ ఔలియా) ఉర్సు ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. మండలంలోని పొన్నాడ బషీర్‌బీబీ 70వ ఉర్సు సందర్భంగా చివరి రోజైన ఆదివారం భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు బంగారు పాపమ్మ వారిని దర్శించుకునేందుకు తరలిరావడంతో పొన్నాడ భక్తులతో కిటకిటలాడింది. పోలీసుల భారీ బందోబస్తు నడుమ సుమారు 50 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్టు దర్గా ముజావర్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గంధోత్సవం కన్నుల పండువగా జరిగింది. మూలపేటకు చెందిన షేక్ మౌలాసాహెబ్ ఇంటి నుంచి పెద్ద బొడ్డేపల్లికి చెందిన ఎండీ తాజుద్దీన్‌బాబా సమర్పించిన గంధాన్ని(సందల్) ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంపై ఉంచి, ఫకీర్ మేళంతో పొన్నాడలోని దర్గా వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దర్గాలో ఫాతెహా ఖానీ నిర్వహించి, అనంతరం అమ్మవారికి గంధాన్ని పూశారు. సంప్రదాయ ప్రార్థనల అనంతరం భక్తులకు గంధాన్ని పంపిణీ చేశారు. ఈ గంధోత్సవంలో కులమతాలకతీతంగా భారీగా భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన పొన్నాడ

బషీర్‌బీబీ 70వ ఉర్సు సందర్భంగా రాష్ట్రం నలు మూలల నుంచి వచ్చిన భక్తులతో పొన్నాడ కిటకిటలాడింది. మూలపేట నుంచి పొన్నాడ వరకు కాలినడకన వెళ్లేందుకు కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. భక్తుల వాహనాలతో పలు మార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పిఠాపురం, తుని, కాకినాడ నుంచి వచ్చిన వాహనాలు పొన్నాడ చేరుకోవడానికి గంటల సమయం పట్టింది. ఆదివారం ఉదయం నుంచి భక్తుల రాక అంతకంతకూ పెరగడంతో దర్గా ప్రాంగణం కిక్కిరిసింది. స్థానిక ముజావర్లు ఈ ఉర్సు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి ఎస్సై వెంకటేష్ సుమారు 150 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనాలను పొన్నాడ, అమరవిల్లి, నాగులపల్లి వద్ద నిలువరించారు. పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించారు. పారిశుధ్య చర్యలు నిర్వహించారు.



పొన్నాడలోని బషీర్‌బీబీ దర్గా ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు



ఫకీర్ల మేళా



గుర్రం, భక్తులతో బషీర్‌బీబీ గంధోత్సవం

బషీర్‌బీబీని దర్శించుకున్న ఏఎస్పీ



పొన్నాడలో ఉర్సు బందోబస్తును పరిశీలిస్తున్న ఏఎస్పీ

ఉర్సు సందర్భంగా పొన్నాడలో బషీర్‌బీబీ (బంగారు పాపమ్మ)ని ఆదివారం ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చివరి రోజు గంధోత్సవం కావడంతో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తును పరిశీలించారు. ఆయన వెంట పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఎస్సై వెంకటేష్ ఉన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు

సూర్య నమస్కారాల పోటీలు



సూర్య నమస్కారాలు చేస్తున్న బాలలు

పిఠాపురం: సేవా భారతి ఆధ్వర్యంలో 12వ సూర్య నమస్కారాల ప్రదర్శనా పోటీలు స్థానిక అనఘా దత్త క్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సూర్య నమస్కారాల కార్యక్రమంలో బాల బాలికలు పాల్గొని, సూర్య నమస్కారాలు చేశారు. ఈ సందర్భంగా పోటీల విజేతలకు సేవా భారతి సభ్యులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రామచంద్రరావు, పతాంజలి యోగా సమితి సభ్యుడు ఎస్ శ్రీనివాసరావు, జగదీశ్వరరావు, రేపాక సుబ్బారావు, శివరామకృష్ణ, వడ్డాది సుబ్బారావు, గట్టి అశోక్, కొండేపూడి శంకరరావు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య సమస్యలు దూరం

సామర్లకోట: యోగాతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని సానా సతీష్ ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరిష్ అన్నారు. మాధవపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకృతి యోగా సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా జీవనం సాగించాలంటే యోగా ఒక్కటే సాధనమని తెలిపారు. ఈ సందర్భంగా యోగా గురువు వాసంశెట్టి వీరబాబును సత్కరించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

పెద్దాపురం: పట్టణంలోని సుధా కాలనీలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి, రూ.52,210 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై మౌనిక తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఈ దాడి చేసినట్టు చెప్పారు. కేసు నమోదు చేశామన్నారు.